మాపై ఎందుకీ వివక్ష?

'ఖేల్‌రత్న'కు నామినేట్ చేయకపోవడంపై హర్విందర్ అసహనం

ఢిల్లీ: మను భాకర్ 'ఖేల్‌రత్న' వివాదం కొనసాగుతున్న వేళ పారా షూటర్, పారిస్ పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన షూటర్ హర్విందర్ సింగ్ సంచలన కామెంట్స్ చేశాడు. క్రీడా అవార్డుల విషయంలో తమపై వివక్ష ఎందుకని ప్రశ్నించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచినవారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులు ఇచ్చినప్పుడు పారిస్‌లో బంగారు పతకాలు సాధించినవారికి ఎందుకివ్వరు? అంటూ అసహనం వ్యక్తం చేశాడు. అవే పోటీలు, అదే పతకం, అదే గౌరవం తెచ్చినప్పటికీ అవార్డు విషయంలో మాత్రం వివక్ష ఎందుకని 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చాడు. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన అవని లేఖరా, సుమిత్ అంతిల్, ప్రమోద్ భగత్‌కు ఖేల్‌రత్న అవార్డులు వరించాయి.

బుమ్రా అరుదైన ఘనత

టెస్టు ర్యాంకింగ్స్‌లో 900 రేటింగ్ పాయింట్లకు చేరిక

దుబాయ్: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు. కాగా ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో బుమ్రా.. తన రేటింగ్ పాయింట్లను మెరుగుపరుచుకున్నాడు. బ్రిస్బేన్ టెస్టులో 9 వికెట్లతో సత్తా చాటడంతో అతడి ఖాతాలో 14 రేటింగ్ పాయింట్లు (మొత్తంగా 904) చేరాయి. గతంలో భారత్ నుంచి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రమే ఈ ఘనతను అందుకున్న బౌలర్‌గా నిలిచాడు. మెల్‌బోర్న్ టెస్టులో బుమ్రా ఇదే జోరును కొనసాగిస్తే అతడి రేటింగ్ పాయింట్లు మరింత మెరుగవుతాయి. బౌలర్ల ర్యాంకింగ్స్ జాబితాలో బుమ్రా తర్వాత రబాడా, హేజిల్‌వుడ్, కమిన్స్ కొనసాగుతున్నారు.

నమన్ ఓజా తండ్రికి ఏడేండ్ల జైలుశిక్ష

ఇండోర్: బ్యాంకును మోసం చేసిన కేసులో భారత మాజీ క్రికెటర్ నమన్ ఓజా తండ్రి వినయ్ ఓజాకు ఏడేండ్ల జైలుశిక్ష పడింది. 11 ఏండ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని బేటూల్‌లో గల బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖలో అవినీతికి సంబంధించిన కేసులో వినయ్‌ను దోషిగా తేల్చుతూ ముల్తాయ్ అడిషినల్ సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పును వెలువరించింది. ఆ సమయంలో వినయ్ ఓజా.. ముల్తాయ్‌లో గల శాఖకు బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేశారు.మరో నలుగురితో కలిసి ఆయన.. రూ. 1.25 కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారని కేసు నమోదైంది.

కాంబ్లీకి 5 లక్షల ఆర్థిక సాయం

ముంబై: మూత్రనాళాల సమస్యతో బాధపడుతూ భీవండిలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కళ్యాణ్ లోక్‌సభ నుంచి ఎంపీగా ఉన్న ఆయన.. డాక్టర్ శ్రీకాంత్ షిండే ఫౌండేషన్ ద్వారా ఈ సాయం అందజేస్తామని తెలిపారు. కాగా యూరినరీ ఇన్‌ఫెక్షన్ తగ్గినప్పటికీ కాంబ్లీ జ్వరంతో బాధపడుతున్నాడు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అతడి మెదడును స్కానింగ్ చేయాలని వైద్యులు భావించినప్పటికీ జ్వరం కారణంగా అది సాధ్యపడలేదని డాక్టర్ వివేక్ త్రివేది తెలిపారు.

అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్‌తో టీడీసీఏ భేటి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్ పీసీకే వేణు రెడ్డితో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. తెలంగాణలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను యూఎస్ క్రికెట్ బోర్డు ముందుకురావాలని వేణును అల్లీపురం కోరారు. టీడీసీఏకు అవసరమైన సహకారం అందించే దిశగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వేణు తెలిపారు.

'కెప్టెన్సీ రానందుకు పశ్చాత్తాపమేమీ లేదు'

చెన్నై: సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు ఇటీవలే వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ తనకు కెప్టెన్సీ దక్కలేదున్న పశ్చాత్తాపమేమీ లేదని అన్నాడు. అలాగే తాను ఘనమైన వీడ్కోలును కోరుకోలేదని, అలాంటి వాటికి తాను వ్యతిరేకమని తెలిపాడు. రిటైర్మెంట్ తర్వాత అశ్విన్ తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ పై విధంగా స్పందించాడు. గ్రాండ్ సెండ్ ఆఫ్‌లు సూపర్ సెలబ్రిటీ సంస్కృతిలో భాగమని తాను భావిస్తానని, అలాంటి వాటికి తాను దూరంగా ఉంటానని అన్నాడు. తాను అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే వీడ్కోలు పలికానని క్రికెట్ గురించి మాట్లాడటం, కోచింగ్‌ను ఇష్టపడతానని అశ్విన్ తెలిపాడు. తన రిటైర్మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదని, ఎవరైనా ఉన్నా వాళ్ల గురించి తనకు తెలియదని చెప్పుకొచ్చాడు.

బాక్సింగ్ పంచ్ ఎవరిదో?

నేటి నుంచే భారత్, ఆసీస్ నాలుగో టెస్టు ● జోరుమీదున్న కంగారూలు ● దశాబ్దకాలంగా మెల్‌బోర్న్‌లో ఓటమెరుగని టీమ్‌ఇండియా

రోహిత్ సేనను వేధిస్తున్న బ్యాటింగ్ కష్టాలు ● డబ్ల్యూటీసీ ఫైనల్‌కు కీలకం!

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కీలక టెస్టుకు నేడు తెరలేవనుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లూ తలా ఓ మ్యాచ్ నెగ్గగా ఓ టెస్టు డ్రా గా ముగిడయంతో గురువారం నుంచి మొదలుకాబోయే 'బాక్సింగ్ డే' టెస్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగాల్సి ఉన్న ఈ మ్యాచ్‌లో గెలుపుపై ఇరు జట్లూ ధీమాతో ఉన్నాయి. ఎంసీజీలో గెలిచి సిరీస్‌ను దక్కించుకునేందుకు కంగారూలు ప్రణాళికలు రచిస్తుండగా దశాబ్ద కాలంగా ఇక్కడ ఆడిన మూడు టెస్టుల లోనూ ఓటమన్నదే లేని టీమ్‌ఇండియా.. అదే ఫీట్‌ను రిపీట్ చేయాలని భావిస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును దక్కించుకోవాలని చూస్తున్న భారత్‌కు మెల్‌బోర్న్‌లో గెలవడం అత్యంత కీలకం.

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య గురువారం నుంచి ప్రఖ్యాత మెల్‌బోర్న్ స్టేడియం వేదికగా నాలుగో టెస్టు మొదలుకానుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన ఈ సిరీస్‌లో ఇరు జట్లూ తలా ఓ టెస్టు నెగ్గి (మూడో టెస్టు డ్రా) సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న నేపథ్యంలో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో గెలిచిన జట్టు సిరీస్‌ను దక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆతిథ్య ఆస్ట్రేలియా కంటే ఈ మ్యాచ్‌లో గెలవడం రోహిత్ సేనకు అత్యంత ఆవశ్యకం. ఎంసీజీలో గెలిస్తే సిరీస్‌ను నిలబెట్టుకోవడంతో పాటు వచ్చే ఏడాది లార్డ్స్ వేదికగా జరగాల్సి ఉన్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో బెర్తును ఖాయం చేసుకునే అవకాశాలూ భారత్‌కు మరింత మెరుగవుతాయి. కాగా ఎంసీజీ పిచ్ బంతితో పాటు బ్యాట్‌కూ అనుకూలించే అవకాశం ఉండటంతో ఇరు జట్ల మధ్య హోరాహోరి పోరు ఖాయంగా కనిపిస్తోంది.

పర్యాటక జట్టుకు బ్యాటింగ్ కష్టాలు

ఈ సిరీస్‌లో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్, రాహుల్, కోహ్లీ ప్రదర్శనలను మినహాయిస్తే భారత బ్యాటర్లు వరుసగా విఫలమవుతున్నారు. అడిలైడ్‌లో దారుణ ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. గబ్బాలో రాహుల్, జడేజా ఫర్వాలేదనిపించగా మిగిలినవారు కాడి వదిలేశారు. రాహుల్ ఓపెనర్‌గా రాణిస్తుండటంతో అతడి స్థానాన్ని వెనక్కి జరిపే సాహసం చేయలేక కెప్టెన్ రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నా రెండు టెస్టులలోనూ (3,6,10) అతడు కనీసం రెండంకెల స్కోరు చేయడానికే తంటాలు పడ్డాడు. మెల్‌బోర్న్‌లో హిట్‌మ్యాన్ ఓపెనర్‌గా వస్తాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే రాహుల్ మూడో స్థానంలో, గిల్ మిడిలార్డర్‌లో ఆడే చాన్స్ ఉంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ మినహా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం విఫల ప్రదర్శన భారత్‌ను వేధిస్తోంది. ఆఫ్‌సైడ్ ఆవల బంతులను వెంటాడి బలవుతున్న కోహ్లీ బలహీనత బ్రిస్బేన్ (7,11)లోనూ కొనసాగింది. మెల్‌బోర్న్‌లో మంచి రికార్డు కలిగిన విరాట్.. తనకు ఎంతో ఇష్టమైన ఎంసీజీలో అయినా బ్యాట్ ఝుళిపించాలని అభిమానులు ఆశిస్తున్నారు. గిల్, పంత్ మెల్‌బోర్న్‌లో సత్తా చాటాలని భారత్ భావిస్తోంది.

కూర్పుపై తర్జన భర్జన

నాలుగో టెస్టులో తుది కూర్పుపైనా భారత్ తర్జనభర్జన పడుతోంది. సిరీస్‌లో ఆసీస్‌కు కళ్లెం వేస్తున్న పేసు గుర్రం బుమ్రాకు అండగా నిలిచే బౌలర్ లేకపోవడం టీమ్‌ఇండియాను దెబ్బతీస్తోంది. సిరాజ్ వికెట్ల వేటలో వెనుకబడుతున్నాడు. మూడో టెస్టు ఆడిన ఆకాశ్ దీప్ కూడా ఆకట్టుకునే ప్రదర్శన చేయలేదు. అయితే ఎంసీజీ పిచ్ నాలుగో రోజు నుంచి స్పిన్నర్లకు అనుకూలించే అవకాశాలుండటంతో ఈ మ్యాచ్‌లో ఇద్దరు స్పెషలిస్టు స్పిన్నర్లతో భారత్ బరిలోకి దిగొచ్చని సమాచారం. జడ్డూకు తోడుగా వాషింగ్టన్‌ను ఆడించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రచిస్తోంది. అదే జరిగితే తుది జట్టు నుంచి నితీశ్ రెడ్డిని తప్పించే అవకాశముంది. కానీ గత మూడు టెస్టులలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న నితీశ్‌పై వేటు వేస్తారా? అన్నది ఆసక్తికరం.

అతడిని ఆపితేనే..

భారత్ మాదిరిగానే ఆసీస్‌నూ బ్యాటింగ్ కష్టాలు వేధిస్తున్నా రెండు జట్లకు తేడా ట్రావిస్ హెడ్ ప్రదర్శనలే. టీమ్‌ఇండియా అంటేనే ఎక్కడలేని ఉత్సాహంతో చెలరేగే హెడ్ మెల్‌బోర్న్‌లోనూ అదే సీన్ రిపీట్ చేస్తే మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకోవాల్సిందే. ఈ సిరీస్‌లో ఇప్పటికే అతడు 89, 140, 152తో భీకర ఫామ్‌లో ఉన్నాడు. స్టీవ్ స్మిత్ కూడా గబ్బా టెస్టులో సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. ఖవాజా, లబూషేన్, మార్ష్ ఆశించిన స్థాయిలో రాణిస్తే భారత్‌కు తిప్పలు తప్పవు. హెడ్‌తో పాటు వీరిని అడ్డుకోవడానికి భారత్ ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగాలి. ఈ మ్యాచ్‌లో ఆసీస్.. ఓపెనర్ మెక్‌స్వీనే స్థానంలో సామ్ కొన్‌స్టాస్‌ను ఆడిస్తోంది. పేస్ త్రయం స్టార్క్, కమిన్స్, బొలాండ్‌కు తోడుగా ఈ మ్యాచ్‌లో స్పిన్నర్ నాథన్ లియాన్ భారత బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాడు.

తుది జట్లు

భారత్ (అంచనా): యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రోహిత్ శర్మ (కెప్టెన్), రవీంద్ర జడేజా, నితీశ్ రెడ్డి/వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ **ఆస్ట్రేలియా:** ఉస్మాన్ ఖవాజా, సామ్ కొన్‌స్టాస్, మార్నస్ లబూషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, స్కాట్ బొలాండ్

2014 నుంచి మెల్‌బోర్న్‌లో భారత్ టెస్టు ఓడలేదు. 2018-19, 2020-21లో టీమ్‌ఇండియాదే విజయం.

ఇప్పటిదాకా ఆసీస్ 43 బాక్సింగ్ డే టెస్టులు ఆడితే అందులో 26 గెలిచింది. భారత్‌తో 9 ఆడి ఐదింటిలో నెగ్గింది.

నేటి నుంచే పీకేఎల్ ప్లేఆఫ్స్

పూణె: గత కొద్దిరోజులుగా క్రీడాభిమానులను అలరిస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో రాణించి పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ (ఈ రెండు జట్లు నేరుగా సెమీస్ చేరాయి), యూపీ యోధాస్, పాట్నా పైరేట్స్, యూ ముంబా, జైపూర్ పింక్ పాంథర్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. గురువారం యూపీ.. తొలి ఎలిమినేటర్‌లో జైపూర్‌తో తలపడనుండగా రెండో ఎలిమినేటర్‌లో పాట్నా.. ముంబైని ఢీకొననుంది. ఎలిమినేటర్ విజేతలు శుక్రవారం (డిసెంబర్ 27) హర్యానా, ఢిల్లీతో తలపడతారు. ఈనెల 29న ఫైనల్ జరుగనుంది.

అర్జున్ సర్కార్ యాక్షన్

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. సక్సెస్‌ఫుల్ 'హిట్' సినిమా ఫ్రాంఛైజీలో వస్తున్న మూడో చిత్రమిది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. శ్రీనిధిశెట్టి కథానాయిక. ప్రస్తుతం కశ్మీర్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని.. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాని స్టైలిష్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. కశ్మీర్ షెడ్యూల్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నామని, ఇవి సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: శైలేష్ కొలను.

చిత్రం

'ఎల్లమ్మ'లో నాయికగా?

సినిమాల ఎంపికలో సాయిపల్లవి చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది. కథలో కొత్తదనంతో పాటు ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉంటేనే అంగీకరిస్తుంది. అందుకే ఆమె ఒప్పుకునే సినిమాల గురించి ప్రేక్షకులు ఆసక్తిని కనబరుస్తారు. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్నారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాత. తెలంగాణ నేపథ్య కథాంశమిది. ఇందులో కథానాయిక పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఈ కథ సాయిపల్లవికి బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించిందట. అయితే ఈ వార్తలో వాస్తవమేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం సాయిపల్లవి 'తండేల్' చిత్రంలో నటిస్తున్నది. ఫిబ్రవరిలో ఈ సినిమా విడుదలకానుంది. అనంతరం 'ఎల్లమ్మ' సినిమా పట్టాలెక్కుతుందని సమాచారం.

గ్యాంగ్‌స్టర్ డ్రామా 'రెట్రో'

సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రానికి 'రెట్రో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. స్వీయ నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం టైటిల్‌ను వెల్లడించడంతో పాటు టీజర్‌ను కూడా విడుదల చేశారు. కాశీ ఘాట్‌లో సూర్య, పూజాహెగ్డేల మధ్య సంభాషణతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్రేమకోసం తాను హింసాత్మకమైన గ్యాంగ్‌స్టర్ ప్రపంచం నుంచి తప్పుకుంటానని, పెళ్లి చేసుకొని జీవితంలో స్థిరపడతానని సూర్య చెప్పే సంభాషణలు భావోద్వేగభరితంగా సాగాయి. సూర్య, పూజాహెగ్డేల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. సూర్య ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. ప్రేమ, రొమాన్స్, యాక్షన్ అంశాలతో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. జయరామ్, కరుణాకరన్, జోజు జార్జ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్‌కృష్ణ, సంగీతం: సంతోష్ నారాయణన్, నిర్మాతలు: జ్యోతిక, సూర్య, రచన-దర్శకత్వం: కార్తీక్ సుబ్బరాజ్.

డిఫరెంట్ షేడ్స్‌లో 'లైలా'

యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. కథానుగుణంగా ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో ఆయన లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. లైలా పాత్రలో ఇప్పటికే విడుదలైన విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌కు మంచి స్పందన లభించింది. బుధవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశ్వక్‌సేన్ స్టైలిష్ లుక్స్‌తో కనిపించారు. మోడరన్ అవుట్‌ఫిట్‌లో ట్రెండీగా ఉన్నారు. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ పాత్ర డిఫరెంట్ షేడ్స్‌లో సాగుతుందని, ఆయన కెరీర్‌లోనే వైవిధ్యమైన కథాంశమని మేకర్స్ తెలిపారు. ఆకాంక్షశర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.

నచ్చితే పదిమందికి చెప్పండి

ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సినిమా నచ్చితే పదిమందికి చెప్పండని, నచ్చకపోతే వందమందికి చెప్పండని, కథలో హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయని, ముఖ్యంగా చివరి నలభై నిమిషాలు హార్ట్‌టచింగ్‌గా అనిపిస్తుందని దర్శకుడు తెలిపారు. తాను ప్రభాస్‌కు పెద్ద అభిమానినని, ఇటీవల ఆయన్ని కలిసినప్పుడు సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుతూ, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పడం సంతోషాన్నిచ్చిందని హీరో ధర్మ అన్నారు. ఈ సినిమా అద్భుతంగా వచ్చిందని, శ్రీవసంత్ మ్యూజిక్, చంద్రబోస్ లిరిక్స్‌కు మంచి పేరొచ్చిందని నిర్మాతల్లో ఒకరైన ఇస్మాయిల్‌షేక్ పేర్కొన్నారు. కథానుగుణంగా అద్భుతమైన పాటలు కుదిరాయని, యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందని సంగీత దర్శకుడు శ్రీవసంత్ తెలిపారు. ఈ చిత్రానికి బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్‌షేక్, లహరిధర్ నిర్మాతలు.

వినోదాత్మక ప్రేమకథ

రామ్‌కిరణ్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'సకుటుంబానాం'. ఉదయ్‌శర్మ దర్శకుడు. మహాదేవ గౌడ, నాగరత్న నిర్మాతలు. బుధవారం ఈ సినిమా తాలూకు ఓ గీతాన్ని విడుదల చేశారు. 'అది దా సారు' అంటూ సాగే ఈ గీతానికి మణిశర్మ స్వరాల్ని అందించగా అనంత్‌శ్రీరామ్ రచించారు. రొమాంటిక్ గీతమిదని, నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. చక్కటి వినోదంతో కుటుంబ కథగా మెప్పిస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్ తదితరులు నటిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.